# అరవింద-గురివెంద

[ గత సంచిక నుంచి ]

'నిజం చెప్పాలంటే అంతే! ఆమె దగ్గర ఎంత సేపు కూర్చోవాలన్నా నాకు విసుగనిపించదు. మీరు కూడా వచ్చారు కదా అని వెంటనే బయలుదేరాను - కాని, లేకపోతే ఇలా వచ్చేదాన్ని కాదు.''

''ఏమో బాబూ! నాకు అక్కడ కూర్చున్నంత సేపు ముళ్ళమీద కూర్చున్నట్లే అనిపించింది.''

'' ఏం ? ''

'' అదేమిటావిడ ! సిగ్గు లేకుండా అడ్డమయిన పన్లూ మొగుడిచేత చేయిస్తోంది ! పోనీ కాఫీ అదీ అంటే ఫర్వాలేదు. ఆడవాళ్ళ బట్టలుతికే మగాళ్ళని....అవ్వ ! ఎక్కడా చూళ్ళేదు'' అని వికవికా నవ్వింది అనసూయ.

నాకు అరికాలిమంట నెత్తికెక్కింది. "ఇందులో సిగ్గుపడాల్సిందేముందండి? మొగుడి బట్టలు రోజూ పెళ్ళాం ఉతగ్గాలేన్డి....అవసరం వచ్చినప్పుడు ఆవిడ బట్టలు ఆయన ఉతకటంలో తప్పేముంది? చేసుకొనేవాళ్ళకు లేని అభ్యంతరం చూసేవాళ్ళకెందుకు ?''

'' అంత కర్మేమొచ్చిందసలు ? పనిమనిషిచేత చేయించుకోవచ్చుగా !''

'' ఎవరి పన్లు వాళ్ళు చేసుకోవటంలో కర్మేమిటో నాకర్థం కావటం లేదు!'' చివరి మాట ఒత్తి మరీ పలికాను.

'' అంటే, పనిమనిషిచేత చేయించుకోవటం కర్మమనా మీ ఉద్దేశం !''

ఆవిడలా భుజాలు తడుముకోవటంతో నాకంత కోపం లోను నవ్వు వచ్చింది. బలవంతంగా ఆపుకున్నాను. ''....అని నేననలేదు. అసలు కర్మ సంగతి నేనెత్తలేదు. వాళ్ళ పనులు వాళ్ళు చేసుకుంటున్నారన్నాను. అది వాళ్ళకి మొదట్నించి అలవాటన్నాను. ఇంట్లో జరిగే ప్రతి పనీ భార్యాభర్తలు సరిసమంగా పంచుకుంటారు. లాభాలే కాదు-నష్టాలూను. సుఖాలేకాదు – కష్టాలూను. అదే నేను చెప్పింది. అయినా, వాళ్ళ బాధలేవో వాళ్ళు పడుతున్నారు. మనమెందుకు మధ్య తగవు పడడం ?''

నేను సంభాషణ ఎంత కుదించాలని చూస్తున్నానో ఆవిడంత సాగదీయాలని ప్రయత్నిస్తోంది.

'' అదేదో ఉద్యోగం చేస్తున్నానందిగా ! పది పదిహేను రూపాయిలు పెట్టి ఒక పనిమనిషిని పెట్టుకోవచ్చుగా ! వచ్చిన డబ్బంతా పెట్టి ఏం చేస్తోందిట ? బంగారం కొంటోంది కాబోలు!....''

నాకు కళ్ళనీళ్ళు తిరిగాయి. నన్నే ఆవిడన్ని మాటలన్నా నాకింత బాధ కలిగుండేది కాదు !

తన గురించి ఒక్క చెడుమాట కూడ అనని మంచి మనిషిని గురించి ఇన్ని పాడు మాటలంటోంది ఆవిడ. అవన్నీ అబద్ధాలనీ—అపోహలనీ నాకు చెప్పాలని వుంది. అరవింద ఎంత ఉన్నత హృదయం కలదో సోదాహరణంగా వివరించాలని వుంది.

కాని, కేవలం మరది చదువుకోసం, ఆడపడుచు పెళ్ళికోసం ఉద్యోగంలో చేరి తన ఆరోగ్యాన్ని కూడా లెక్క చెయ్యకుండా శ్రమిస్తున్న త్యాగమయి అరవింద అని అంటే-అనసూయ హఠాత్తుగా తన అభిప్రాయం మార్చుకుంటుందా ? తమ కోసం తమ సర్వస్వం ధారపోసిన వదినలో వాళ్ళు తల్లిని మించిన తల్లిని చూసుకుంటున్నారని అంటే అన్ని మాటలు అనవసరంగా అన్నందుకు పశ్చాత్తాపపడుతుందా? అటువంటి అమృతమూర్తిని కొనియాడటానికి నిఘంటువులోని మంచి పదాలన్నీ కలబోసినా చాలవని నేనంటే నిండు మనసుతో అరవింద చేతిని తను అందుకుంటుందా ?

లేదు....నాకావిడ మీద అలాంటి నమ్మకం కలగలేదు ! అందుకనే నా కాపైన గొంతు పెగల్లేదు !

మర్నాడు మురళి పుట్టిన రోజుకని అరవింద వచ్చినప్పుడు అందరి కంటె ఎక్కువ ఆనందించింది నేను. ఆమె ఉత్త చేతులతో రాలేదు. మురళికి బహుమతి తీసుకు మరీవచ్చింది.

ఆమె తన చేతబెట్టిన పుస్తకాల దొంతర చూసి ఆ పిల్లవాడు మురిసిపోలేదు. ముఖం ముడుచుకున్నాడు. అదే ఏ తినే వస్తువో—ఏ ఆట వస్తువో అయివుంటే వాడి ముఖం ఎంతో వికసించేదని పాపం, అరవిందకు తెలియదు !

భార్య కోరిక మీద ఆఫీసరుగారు తమ ఆఫీసులో పనిచేసే ఓ అమ్మాయిని ముందే పంపారు. ఆమె చేత ఆయన ఆఫీసులో ఎప్పుడయినా ఇంటి 'పని' చేయించుకున్నారో లేదో కాని—అనసూయ మాత్రం పేరంటం పనంతా ఆపిల్లకే అప్పగించేసింది.

ఆవిడ కోరకుండా నాకు ముందడుగు వేయాలనిపించలేదు. ఆపిల్లపడే శ్రమ అక్కడి వాళ్ళెవరూ గుర్తించినట్లులేదు.

అందరిలాంటిదీ కాదు అరవింద. అందుకనే, ఆ పిల్లకు తోడుగా తనూ వెళ్ళింది. ఆ యింట్లో పండుగ తన చేతుల మీదుగా జరిపించింది.

ఆ హడావిడి అంతా అయిపోయాక మా యింట్లోకి తీసుకుపోయా నామెను. '' పేరంటాళ్ళు ఇప్పుడు జరిగింది నా కొడుకు పుట్టిన రోజేమో అనుకుంటున్నారు. కాదమ్మా – అని అందరికీ నచ్చ చెప్పేసరికి నా తల ప్రాణం తోకకు వచ్చింది....'' అన్నాను కోపం తెచ్చుకొని.

'' అబ్బ ! ఏమో అనుకున్నాను—మాటలతో నువ్వూ తినేస్తున్నావు సుమా !'' అని నవ్వింది. అరవింద.

'' నీ నవ్వు చూస్తుంటే నా ఒళ్ళు మండిపోతుంది. నిన్న నడుం నొప్పిపెట్టిందని మంచం మీదున్నావు. ఈ వేళ నడుం విరుచుకొని ఈ చాకిరీ అంతా ఎవరు చేయమన్నారు ? ఆవిడ మెచ్చుకొని మేక తోలు కప్పుతుందనుకున్నావా ? ఆ పిల్లకి ఆయన ఆఫీసుకాని—ఆవిడ ఆఫీసర్లా ఆ అథార్టీ ఏమిటి ? మీరిద్దరూ అదవ చాకిరీ చేస్తుంటే ఆవిడ నడుం మీద చెయ్యేసుకొని దర్జాగా నిలబడి చూసింది తెలుసా !''

'' నువ్వీ దృష్టిలో ఎందుకు చూస్తున్నావు వసూ ? ఎవరో మంచిని గుర్తించటం లేదని మనలోని మంచి ఆలోచనలు విడిచిపెడతామా ! మనం ఏ మంచి పని అయినా ఎందుకు చేస్తున్నాం ? ఎవరో మెచ్చుకోవాలనికాదు. మన కది మంచిదని తోచింది కనుక—మనకా మంచి చేయటమే తెల్సును కనుక. ఆ పిల్ల ఒక్కర్తే అంత శ్రమపడుతుంటే నువ్వేలా చూస్తూ ఊరుకోగలిగావు !

ఆవిడ వైపు కోపంతో చూస్తూ కూర్చునే బదులు–ఆ పిల్లవైపు కరుణతో ఎందుకు చూడలేదు?"

సిగ్గుతో బిక్కచచ్చిపోయాను. "నన్ను క్షమించు అరవిందా!" అన్నాను.

"మనం ఏ దృష్టి పెట్టుకుంటే మన ఆలోచనలు అలాగే సాగుతాయి. నీ మనసులో తియ్యని అనుభూతులుంటాయి. నీ మాటల్లో కమ్మని భావాలుంటాయి. నీ చూపుల్లో పాల వెన్నల కురుస్తూంటుంది. అటువంటి వసూనే నే నెప్పుడూ చూడాలనుకుంటాను. అలా కాక మరోలా ఉంటే నేను భరించలేను...."

ఇటువంటి మంచి మనిషినా అనసూయ అవహేళన చేసి మాట్లాడుతున్నది?

ఆ తర్వాత ఆవిడ వస్తే–అరవిందను గురించి ప్రస్తావిస్తే–ఆమె అన్న మాటలన్నీ చెబుదామనుకున్నాను. మేరుగిరివంటి అరవిందముందు తానెంత నలుసులాంటిదో తెలియ చెబుదామనుకున్నాను. చిత్రం! ఆవిడ మర్నాడు రానేలేదు. కనీసం తమ పిల్లాడికి వచ్చిన బహుమతులు గొప్పగా చూపించటానికీ రాలేదు. పోనీ అరవింద ఇచ్చిన పుస్తకాల మీదయినా 'కామెంట్' చేస్తుందనుకుంటే దానికీ రాలేదు.

మొదటిసారిగా ఆవిడ గురించి నా ఊహ తారుమారైంది.

"చూడండి వసుంధరగారూ, వందరూపాయలకి చిల్లరలేదు. మార్చాక ఇస్తాను....ఓపాతిక ఉంటే ఇస్తారా?" అంటూ వచ్చింది అనసూయ.

"అలాగే" అని డబ్బు తెచ్చి ఇచ్చాను.

"ఇదిగో ఈ గిన్నె కొన్నాను. పాతిక్కి నష్టం లేదంటారా! ఒక్కొప్పుడు వీధిలోకి అమ్మొచ్చే వాళ్ళు బహు చవగ్గా ఇస్తుంటారు...."


ఇంట్లో అటువంటి సామాను బోలెడంత ఉండగా ఇప్పుడెందుకు కొన్నదో నాకర్థం కాలేదు. ఆ మాట అనటం, లేనిపోని సంభాషణ పెంచటం–నాకిష్టం లేదు.

"బాగుంది. తీసుకోండి" అని మాత్రం అన్నాను–నేనామాట అనకపోయినా తీసుకుంటుందని తెల్సు కనుక! అసలు నేనలా అనాలనే ఆవిడ ఆశించి అడిగింది కనుక!

ఆవిడ తత్వం కొంత అర్థమయింది కనుక ఇదంతా నాకు వింతేమీ అనిపించ లేదు. ఎంత సేపూ నలుగురి ఎదుటా తానెంతో 'ఉన్నదాన్ని' అని ప్రదర్శించుకోవటమే ఆవిడకు మక్కువని–అందుకు ఎంతయినా ఖర్చు పెట్టగలదని మాత్రమే అనుకున్నాను. కాని, ఆవిడలో మరో 'గొప్పతనం' కూడా ఉందని ఆ మరునాడు కాని నాకు తెలియలేదు!

ప్రొద్దున్న ఆఫీసుకి వెళ్ళేటప్పుడు, "ఏమన్నా డబ్బులిస్తావుటోయ్!" అని అడిగారాయన. ఉన్న పదినోటు కాస్తా ఆయన చేతిలో పెట్టాను.

ఇంట్లో కొన్ని వంటసరకులు నిండుకున్నాయి.



విమలారామం

ఈ పూట అనసూయ తన 'వందనోటు' మార్చి చిల్లర ఇస్తుంది కదా–అప్పుడు అవసరమైన సరుకులు కొనుక్కోవచ్చు ననుకున్నాను. ఆవిడ సాయంత్రం అవుతున్నా నాకు ముఖం చూపించ లేదు. ఆవిడ ఏ వేళప్పుడు బయటకు వస్తుందా అని ఇటూ అటూ తచ్చాడుతున్నాను కాని–ధైర్యం చేసి తలుపు తట్టలేక పోయాను.

అంత 'అనలేం'గా ఆవిడ అప్పు అడగ గలిగింది. అవసరంలో ఉన్నా—ఆవిడ దగ్గర ఉన్నుందని తెల్సినా—ఆ అప్పు తీర్చమని నేనడగ లేక పోతున్నాను!

నాలో నేను కొట్టుమిట్టాడుతున్నానే కాని మనస్సు కాలుని కదలనివ్వలేదు. ఉన్నట్టుండి వాళ్ళ తలుపు తెరుచుకొనేసరికి ఆశగా బయటకు వచ్చాను. ఆవిడ నన్ను చూసినట్టేలేదు. వీధి గుమ్మం లోకి వెళ్ళి ఎవర్నో కేకవేసింది. అప్ప టికి నా కర్థమయింది వైర్‌లెస్ సెట్టులాగ—ఆవిడ చెవులు—అమ్మకం కేకలకే 'ట్యూను' చేసుకు స్థిరమయి ఉంటాయని!

ఎవడో బట్టలమూట సైకిలు మీదనుంచి దింపు కొని వచ్చాడు.

"చూద్దాం రండి!" అని ఆహ్వానించింది అనసూయ.

లేని ఉత్సాహం తెచ్చుకొని ఆవిడతో పాటు నేనూ బట్టలు చూశాను.

కొందరు అత్యవసరమయినా బట్టలు కొనుక్కోలేరు. అటువంటి వాళ్ళకి అప్పు కావాలన్నా ఇచ్చే వాళ్ళుండరు!

మరి కొందరు ఉన్నవాటితోనే గడుపుకు పోతుంటారు. వాళ్ళకి అప్పు పుడుతుంది—అయినా కోరికలకి వాయిదా వేసుకుంటారు. మనసులో వాటిని పెరక్కుండా చూసుకుంటారు.

కాని, అనసూయలాంటి 'గొప్పవాళ్లు' ఉన్నారు. వాళ్ళకి అవసరాలకి మించి అన్నీ ఉన్నాయి. వాళ్ళ నిఘంటువులో 'తృప్తి' అన్న పదానికి తావులేదు. ఎన్నున్నా ఇంకా కావాలనే ఉంటుంది; నీతి-నియమం అక్కర్లేదు. వెనకా ముందూ చూడ్డం లేదు. ఎవరేమనుకుంటారో అని జంకు లేదు. అతిసునాయాసంగా అప్పడిగేయగలరు—అంత ఫ్రీగానూ కనిపించిందల్లా కొనెయ్యగలరు! రేపటి రోజుగురించి వాళ్ళకి భయం లేదు—అప్పటి కేదో ఒక మార్గం కనిపిస్తుందన్న ధీమా వాళ్ళకు ఉండనే ఉంది!

అనసూయ నా కళ్ళముందే వంద రూపాయల నోటు బట్టల వాడికిచ్చింది. వాడు ముప్ఫయ్యయిదు రూపాయిలు తిరిగిచ్చాడు. వాళ్ళ పిల్లలకి చెరొక జత తీసుకుంది! పైగా అవి బాగున్నాయని—మంచి బేరం చేశానని — నా చేత 'సర్టిఫికెట్టు' కూడా తీసుకుంది.

మనసులోని మాట నోట్లోకి రాక ముందే—చకచకా ఇంట్లోకి వెళ్ళిపోయింది. 'కనీసం, ఈ పూట అవసరానికి ఓ పది రూపాయలయినా తిరిగి ఇవ్వండి' అని అడగలేకపోయాను!

అనసూయ నేననుకున్న దానికంటే నిజంగా 'గొప్పది'!

ప్రాణావసరాలు వచ్చినప్పుడు—పైస కూడా చేత లేనప్పుడు-అనసూయ ఏం చేస్తుంది?

అలాంటి సందర్భం రావాలని నేను శపించ లేదు. అదివచ్చి ఆవిడ కళ్ళు తెరచుకోవాలని నేను మొక్కుకోనూలేదు.

కాని, అనుకోకుండా అటువంటి అవసరం ఆవిడకు ఆ మర్నాడే వచ్చింది!

ఆఫీసరుగా రావేళ ప్రొద్దున్నే ఏదో వూరు కేంపు వెళ్ళారు. మేమంతా చూస్తుండగానే—వాళ్ళ మురళి కాంపౌండు గోడెక్కి పందెంకాసి మరీ క్రిందికి దూకాడు—కాలు విరిగింది. హాస్పిటల్లో చేర్చాల్సి వచ్చింది.

"ఓ వంద రూపాయిలుంటే ఇవ్వండి. అర్జంటుగా మందులు తెప్పించాలి. డాక్టరుకు ఇవ్వాలి," అంది అనసూయ.

"నాదగ్గర ఏమీ లేదండీ....ఉన్న పాతికా మొన్ననే మీకిచ్చాను." సందర్భం మంచిది కాకపోయినా మనసులోని మాట అనకుండా ఉండ లేక పోయాను. నా డబ్బు నాకు తిరిగివ్వలేదన్న ఉక్రోషంతో ఆమాట అనలేదు. చేతిలో అత్యవస రాలకి కొంచెమయినా ఉంచుకోకుండా—అందులో ఆఫీసరుగారు ఊళ్ళో లేనప్పుడు—కనపడిందల్లా కొని అంతా ఖర్చు పెట్టుక్కూర్చుందన్న కోపం తోనే ఆ మాటన్నాను!

"ప్లీజ్! మరొకలా అనుకోకండి. ఆయన వచ్చాక అదీఇదీ అంతా కలిపి ఒకేసారి ఇచ్చేస్తాను!" అంది ప్రాధేయపడుతున్నట్లు. కావాలంటే ఆవిడెంత సౌమ్యంగా నయినా ఉండ గలదని నాకప్పుడే తెల్సింది.

ఛ! ఒక్క క్షణంలో ఆవిడనంత కించపరిచా నేమిటి? నా మీద నాకే కోపం వచ్చింది. "అహఁ! నిజంగానే నా దగ్గర లేదండి. ఉంటే తప్పకుండా ఇచ్చేదాన్ని. పోనీ, ఆయన్ని ఆఫీసు నుంచి రానివ్వండి. ఎక్కడయినా అడిగి తెమ్మంటాను."

"ఆయన రావటం ఆలస్యమవుతుందేమో! పైగా వచ్చిన వెంటనే ఎక్కడికని వెడతారు!"

అదీ నిజమేననిపించింది. ఇతరుల గురించి కూడా ఆవిడ ఆలోచించగలదన్నమాట!

"పోనీ, మీ ఫ్రెండు....అదేనండి.... అరవిందగారివ్వగలరేమో!"

ఇన్నేళ్ళ స్నేహంలో ఎప్పుడూ చేయని పని ఇప్పుడీవిడ చేయమంటున్నందుకు కాదు—తానొక పనికిమాలిన మనిషిగా తీసి పారేసిన అరవింద నుంచే ఆవిడ సహాయం ఆశిస్తున్నందుకూ, నాకు తట్టని ఊహ—ఆవిడలో పుట్టుకువచ్చినందుకూ నేను నిర్ఘాంతపోయాను!

ఆ తర్వాత అనసూయ ఏమంటుందో విందామని ఓక్షణం తటపటాయించాను!

"మీరడిగితే కాదనదు!"

మనస్సులో ఎంత గుర్తింపు?

"నా కోసం మీరీ శ్రమ తీసుకోక తప్పదు."

మాటల్లో ఎంత మార్దవం!

"మీతోపాటు నేనూ వస్తాను. నాకు కొంచెం మాటసాయం కావాలంతే!"

అవును. అత్యవసరం వచ్చినప్పుడు ఎంత మెత్తగా ఉండాలో ఆవిడకు తెలుసు!

"మీరింతగా చెప్పాలా! అలాగే పదండి!" అన్నాను.

ఆ పని మీద అరవింద దగ్గరకి వెళ్ళటానికి నాకానందమే అయింది. ఏ వ్యక్తిని పరోక్షంలో కించపరుస్తూ మాట్లాడిందో—ఆ మనిషి దగ్గరికే అవసరం పెట్టుకొని అర్థించటానికి ఆవిడ వచ్చింది. ఇప్పటికయినా ఆవిడ మనుషుల విలువలు గుర్తిస్తున్నందుకు నాకు సంతోషమే కలిగింది!

అరవింద మాటలు నాకు క్రొత్త కావు. అరవింద నాకు తెలియంది కాదు. అందుకనే అరవింద చెప్పింది విని నేను ఆశ్చర్యపోలేదు.

కాని, అనసూయ మాత్రం షాక్ తిన్నట్లయి పోయింది!

"....ఈ మాత్రం దానికి మీరింతగా చెప్పాలా! మీకష్టమొకటి నాదొకటీనా? మరో ఏభయి తీసుకోండి. అవసరానికి చేతిలో ఉంచు కోవటం మంచిది. వైద్య లోపం రాకుండా చూడండి. తిరిగే పిల్లాడు....పాపం ఎంత బాధ పడుతున్నాడో!" అంది అరవింద.

అనసూయ పెదవులు వణికాయి.

"....మీకింకా కావలిస్తే అడగండి. ఎటువంటి సందేహాలూ పెట్టుకోకండి."

అరవింద మాటలు విని ఆవిడ మాటలు రానిదే అయిపోయింది.

"మరోమాట. మీరు వీలు చూసుకొనే ఇవ్వండి. అన్నరోజుకివ్వలేకపోయానే అని బాధ పడకండి!"

అనసూయ కళ్ళల్లో ఎనలేని కృతజ్ఞత కనిపించింది. అదే నాకు చాలుననిపించింది.

తిరిగి వచ్చేస్తున్నప్పుడు ఆవిడ అరవింద గురించి ఒక్కముక్కయినా మాట్లాడలేదు! ఏమీ మాట్లాడకపోవటమే నాకెంతో బాగుంది. ఆవిడ అలా మౌనంగా ఉండటమే ఒక మంచిని పెంచుకొనే భావనని కలిగించింది!

*


"మంచికోసం మనుషులు మారాలి. అందరిలో మంచిని చూడగలిగేలా మనుషులు తమ దృక్పథం మార్చుకోవాలి." అంటుంది అరవింద!

అనాడు అరవింద ఇంటి నుండి తిరిగి వెళ్ళేటప్పుడు అనసూయ ఎంతో మారిపోయిందనిపించకపోయినా కొంతయినా మారిందనుకున్నాను. మరికొంతకాలానికి ఎంతో మారగలగటానికి ఇప్పటికింతే చాలనుకున్నాను.

కాని, అనసూయ నిజంగా మారలేదు.... మారాలని అనుకున్నట్టూ లేదు.

మారలేదని ప్రతి పూట చెప్పింది — మారేలా లేదని ప్రతిమాట రుజువు చేసింది.

మురళి మళ్ళీ కాలుమీద నిలవగలిగాడు.... నిలవటమే కాదు త్వరలోనే చకచక నడిచాడు. ఈలోగా అనసూయ చెప్పిన గడువూ దాటిపోయింది. ఆ తర్వాత మరోనెల పైనా గడిచింది. కాని, ఆవిడకు అనవసరంగా నానుంచి పుచ్చుకున్న ఒక్క పాతిక సంగతీ గుర్తున్నట్టులేదు! అత్యవసరంగా అరవింద నుంచి తీసుకున్న ఆరు పాతికల విషయమూ జ్ఞాపకం వచ్చినట్లులేదు. అరవింద వీలుచూసుకొని ఇవ్వమంది. ఆ వీలింకా ఆవిడకు వచ్చినట్లులేదు — నాకు వంద నోటు మార్చాక ఇస్తానంది. చకచక ఆవిడ చేతుల మీదుగా నిత్యం మారే ఆ నోట్లలో నాకు రావల్సింది ఎప్పుడు చోటు చేసుకుంటుందో నాకు తెలియటం లేదు.




[వనిత 'స్నేహ పీఠం' ద్వారా స్నేహితులై - వారి వారి అభిరుచుల మీద, వివిధ విషయాల మీద లేఖలు రాసుకుంటున్న మిత్రులు — వారి లేఖలు పాఠకులకు ఉత్సాహకరంగా వుండగలవని అనిపిస్తే మిత్రురాలితో సంప్రతించి, (తొలి నుంచీ వున్న ఇద్దరి ఉత్తరాలనూ) ప్రచురణకు పంపవచ్చును. తగిన స్టాంపులు అతికించిన కవరు కూడా పంపితే, ప్రచురణ కాని పక్షంలో — భద్రంగా తిప్పి పంపివేస్తాము. —వ. సం]

**శ్రీమతి తాడి జీవలక్ష్మి**

**వైఫ్ ఆఫ్ డాక్టర్ టి. రాజరత్నం, డిప్యూటీ సివిల్ సర్జన్, గవర్నమెంట్ హాస్పిటల్, ఒంగోలు**

35 సం॥లు వయసు. గృహిణి. మంచి స్నేహితులను కాంక్షిస్తున్నారు. విజయవాడ, హైద్రాబాదు రేడియో స్టేషన్స్ నిర్వహించే వనితల కార్యక్రమాల్లో పాల్గొంటూ వుంటారు. పెరట్లో తోటలు పెంచడం, పూల మొక్కలు వెయ్యడం అభిరుచి.

**శ్రీమతి కె. జి. వసంతా బాబూరావు**

**వైఫ్ ఆఫ్ శ్రీ కె. జి. బాబూరావు, ఆర్టిస్టు, ఏటిఅవల తాంద్రపాడు పోస్ట్; కర్నూలు జిల్లా**

గృహిణి. 25 సం.లు వయసు. స్కూల్ ఫైనల్ వరకూ చదివారు. చిత్రాలు గియ్యడం, పెయింటింగ్స్ చెయ్యడం తెలుసు. కథలు, గేయాలూ రాస్తారు. 'విజయశంఖం' అనే సినిమాలో కూడా ఒక పాట రాశారు. ముగ్గులు వెయ్యడంలో ప్రత్యేకమైన శ్రద్ధ కనబరుస్తారు. అల్లికలు, కుట్లు కూడా తెలుసు. స్నేహితులంటే ప్రాణంగా భావిస్తారు.

**శ్రీమతి సి హెచ్. అన్నపూర్ణ**

**వైఫ్ ఆఫ్ శ్రీ సి హెచ్. చంద్రరావు, సోవియట్ లాండ్ ఏజెంట్, తణుకు (ప. గో. జిల్లా)**

వయసు 28 సంవత్సరాలు. ఉపాధ్యాయినిగా వుద్యోగంలో వున్నారు. "నేను పుట్టింది శుద్ధ వైదిక బ్రాహ్మణ కుటుంబంలో. చేసుకున్నది వర్ణాంతర వివాహము. కులమత భేదాలు అన్న వారిని దూరంగా వుంచుతాను. సంఘానికి ఒదిగి వున్నంతకాలం అది మనల్ని వంచుతూనే వుంటుంది; ఎదురు తిరిగితే అదే దారి చూపుతుంది" అంటారు ఆమె. తన దృక్పథం గల వారితో స్నేహాన్ని కోరుతున్నారు.

**కుమారి కోటంరాజు భవానీదేవి బి. ఎ.**

**డాటర్ ఆఫ్ శ్రీ కె. సత్యనారాయణశర్మ, అడ్వకేట్, బాపట్ల; గుంటూరు జిల్లా**

రచనలు చెయ్యడంలో ఆసక్తి వున్నది. బరంపురం 'వికాసం' సంస్థ ఇటీవల నిర్వహించిన కథానికల పోటీలో ఉత్తమ బహుమతి పొందారు. వాటర్ కలర్స్‌తో బొమ్మలు వెయ్యడంలో కూడా కృషి చేస్తున్నారు.

**కుమారి వేలూరి సూర్యకుమారి**

**కేరాఫ్ శ్రీ వేలూరి సత్యనారాయణమూర్తి, టి.ఆర్.టి. 125, విద్యానగర్ కాలనీ, హైద్రాబాదు-500044**

పి. యు. సి. చదువుతున్నారు. పిల్లలకు ట్యూషన్లు చెబుతున్నారు. వయసు 24 సం. లు. రచనలు చెయ్యడంలో ఉత్సాహం వున్నది. కుట్లు, అల్లికలు, చిత్రలేఖనం, వంటలు - మొదలైన వాటిల్లో కూడా వుత్సాహం వున్నది. ఎప్పుడూ సరదాగా మాట్లాడేవాళ్ళంటే — చాలా యిష్టం.

**శ్రీమతి పి. రమాదేవి**

**కేరాఫ్ శ్రీ పి. పార్థసారథి, సెక్యూరిటీ డిపార్ట్‌మెంట్; బి. హెచ్. ఇ. యల్. లిమిటెడ్, రామచంద్రపురం, హైద్రాబాదు**

గృహిణిగా జీవితం గడుపుతున్నారు. వయసు 23 సం. లు. పాటలు పాడడంలో, కారమ్స్ ఆడడంలో, కొత్త కొత్త వంటలు చెయ్యడంలో— ఉత్సాహం ఉన్నది. వివిధ అభిరుచులుగలవారితో 'కలంస్నేహం' చెయ్యడం అంటే ఎంతో ఇష్టం.

ఒక సంగతి మాత్రం అస్తమానం గుర్తుకు వస్తోంది నాకు....అనసూయ మాట నిలకడలేని మనిషని ! మాటేకాదు మనసులో మంచి భావాన్ని కూడా అట్టేసేపు ఉంచుకోలేదని !

ఒక్క సంఘటనతోనే నేను ఆ అభిప్రాయానికి రాలేదు. ఒక్క రోజులో అటువంటి అంచనా వేసుకోలేదు. ఆవిడ తత్వాన్నెంతో తరచి చూశాకనే అలా అనుకోవల్సి వచ్చింది. గడిచే ప్రతి రోజూ ఆ అభిప్రాయాన్నే బలపరుస్తోంది !

పిల్లవాడెలా ఉన్నాడో చూద్దామని మూడు సార్లు వచ్చింది అరవింద. ఆమె చేసిన సహాయానికి కృతజ్ఞతగా ఒక కప్పు కాఫీ కూడా ఇవ్వలేదు అనసూయ. కనీసం, అది గుర్తు చేసుకొని లాంఛనంగానైనా మంచిమాట ఒక్కటి పెదవులపై పలికించలేదు.

పైగా చేయరాని చెడ్డపని కొడుకు చేస్తుంటే చూస్తూ ఊరుకుంది. తానే మంచిదనిపించుకోని పని ఇంకొకటి చేసింది.

ఒకనాడు చినుకులు పడుతుండగా వచ్చిన అరవింద తిరిగి వెళ్ళకముందే కుండపోతగా వర్షం కురిసింది. మా అందరి ఎదురుగా మురళి చేస్తున్నపని చూశాక అరవింద గుండెల్లోనూ చెరువులు నిండాయి !

తాను బహుమతిగా ఇచ్చిన పుస్తకాల్లో కాగితాలు చించి పడవలుచేసి తన కళ్ళముందే వాడు నీళ్ళల్లో వేస్తుంటే అరవింద చూస్తూ ఊరుకుండే తప్ప పల్లెత్తుమాట అనలేదు ! అనసూయ కొడుకు చేస్తున్న పనికి ముచ్చటపడిందే కాని ఒక నిండు హృదయాన్ని గాయం చేస్తున్నదని గుర్తించనే లేదు !

నిగ్రహించుకోలేని నేను, "....చదువుకొనే పుస్తకాలలా చింపకూడదు మురళీ!" అని అంటే వాడు నావైపు తలెగరేసి నిర్లక్ష్యంగా చూచాడే కాని నా మాట లెక్క చేయలేదు. నేనలా అన్నప్పుడయినా అర్థం చేసుకొని అనసూయ కొడుకుని మందలించవల్సింది. కనీసం, చూసీ చూడనట్లు ఊరుకోవల్సింది. అదేం లేదు సరికదా "అల్లరి వెధవ !" అని ముచ్చటగా నవ్వింది !

మరోసారి అరవింద వచ్చినప్పుడు - ఆమె ఎదురుగానే అవసరంలేని వంటింటి సామాన్లు కొని వంద నోటు కరిగించింది అనసూయ. పైగా ఆమెకు చూపించి మెప్పుకూడా పొందింది. చేతుల్లో ఉన్న చిల్లర నోట్లు చూసినప్పుడయినా అరవింద ఇచ్చిన సొమ్ము సంగతి ఆవిడకు గుర్తు రాలేదు !

చిత్రమేమంటే - అరవింద అనారోగ్యపు సూచనలు ఆమె ముఖం చూసి గుర్తించ గలిగింది !

"అలా ఉన్నారేం ? ఒంట్లో బాగుండలేదా ?" అని కూడా అడిగింది.

అబ్బ...ఇన్నాళ్ళ నిరీక్షణకి ఈ మంచి మాటే నాకు చాలుననిపించింది.

కాని, నా ఊహ మళ్ళీ తలక్రిందులయింది. ఆవిడ గుర్తింపు నిజంకాదు - ఆవిడ నిజాన్ని గుర్తించలేదు. అందుకనే అరవింద వెళ్ళిపోయాక అనసూయ అన్న మాట లనగల్గింది !

"....ఒంట్లో బాగో లేదా అంటే ఆవిడలా నవ్వి ఊర్కొంటుందేమిటండీ ! మాట వరసకయినా మనస్సులోని మాట చెప్పొచ్చుగా....! అసలింతకీ నేనిలా సామాను కొనుక్కోవటం ఆవిడకు నచ్చలేదనుకుంటాను. కావాలంటే తనూ కొనుక్కోవచ్చుగా ! అలా ముఖం...."

ఇక నిగ్రహించుకోలేకపోయాను. "ప్లీజ్ ! లేనిపోనివలా ఎందుకనుకుంటారు ? మిమ్మల్నేమీ అనలేదుగా ! మీ పనికి అడ్డు రాలేదుగా ! ఒకవేళ నచ్చలేదన్నా మీరు కొనుక్కోవటం మానేస్తారా....? లేకపోతే, ఆమె ఇచ్చిన అప్పు తీర్చేస్తారా ? ఎందుకండీ ఈ మాటలు ! జరగని వాటిని గురించి ఎందుకనుకుంటారు ?" అన్నాను.

మనిషి కొంచెం 'షాక్' తిన్నట్టే కనిపించింది.

"మీరు కూడా ఇలా అంటారనుకోలేదు !" అని ఎలాగో అనగలిగింది ఆవిడ.

"అన్నదేమన్నా నేనే అన్నాను – అరవింద ఏమీ అనలేదు. అసలామెకు ఇలాంటి మాటలు చేత కానూ కావు. నేనయినా మీరామె సంగతి ఎత్తబట్టే అనవల్సి వచ్చింది...."

"ఇన్ని దొంక తిరుగుడు మాటలెందుకు ? అప్పు తీర్చండి అంటే అరుస్తానా-కరుస్తానా ? అప్పు ఎగ్గొట్టే మనిషిననుకుంటున్నారా ! అలాంటి పాడు పనులు మా యింటా ఒంటా లేవు. గతిలేక ఆ వేళ దేబిరించాను కాని ఇలాంటి మనుషులని తెలిస్తే పుచ్చుకోకనే పోదును...."

నిర్ఘాంతపోయాను.

"ఆవేళ పెద్ద దాతృత్వం వెలగపెడుతునట్లు అడిగిందాని కంటె ఎక్కువిచ్చిందిగా ! వీలున్నప్పుడే ఇవ్వమని వెనక్కి పిల్చి మరీ చెప్పిందిగా ! ఇప్పుడీ సన్నాయి నొక్కులెందుకు ? ఆవిడ ఇలాంటి మనిషిని ఎప్పుడూ అనుకోలేదు...."

నాకు కళ్ళ నీళ్ళు తిరిగాయి. అసహ్యకరంగా ఆవిడ చేసిన అభియోగాన్ని ఖండించబోయి – అనాలోచితంగా సంభాషణనింతదూరం తీసుకు వచ్చాను ! అరవింద మంచి మనసుని కొనియాడబోయి–ఆవిడ దృష్టిలో ఆమె వ్యక్తిత్వానికింకా మచ్చ తెచ్చిపెట్టాను.

ఆమె అమృత హృదయంలో ఏ మనిషి మీద ఎప్పుడూ చెడ్డ అభిప్రాయమంటూ రాదని నేనిప్పుడు చెపితే అనసూయ నమ్ముతుందా ? మూడు నెలల క్రితం ఆవిడ డబ్బు తీసుకున్నప్పటి పరిస్థితికి ఇప్పటికి చాల వ్యత్యాసం ఉందంటే ఆవిడ కర్థమవుతుందా ? చేతిలో సరిపడ డబ్బు లేక పుచ్చుకోవాల్సిన మందులనయినా వాయిదా వేస్తోందే కాని–ఎవ్వరినీ నోరు తెరిచి అడగడం లేదంటే – అసలు నిజం భర్తకయినా చెప్పదంటే ఆవిడ 'అయ్యో, పాపం' అని కూడా అనదు. పైగా 'అదంతా అబద్ధం' అని అన్నా ఆశ్చర్యం లేదు.

'డబ్బు లేకపోవటం' అన్నది ఆవిడ నిఘంటువులో లేదు ! 'అందుకనే, చెప్పాలనుకున్నవన్నీ నోట్లోనే నొక్కిపెట్టాను .... ఆవిడ నోటివెంట వచ్చే కూడని మాటలన్నిటినీ అలాగే భరించి ఊరుకున్నాను.

*

"ఈ రోజో శుభవార్తోయ్ నీకు !" అంటూ వచ్చారు శ్రీవారు.

అరవింద గురించి మనస్సులో బాధపడుతున్న నేను–ఎటువంటి శుభవార్త కయినా సంతోషించే స్థితిలో లేను !

"ఏమిటని అడగవేం ?" అని ఆయన రెట్టించారు.

"చెప్పండి," అని లేని నవ్వు తెచ్చిపెట్టుకున్నాను.

'రమ చెవులకి రింగులు చేయించాలంటూ ఇదయిపోయేవుగా....! ఇదిగో ఎరియర్స్ డబ్బులు. ఇప్పుడు మీఅమ్మాయి కోరిక తీరుతుంది. మిగిలిన డబ్బుతో నీకేమయినా కోరికుంటే....అదీ తీర్చుకోవచ్చు !"

## వినతి

'వనిత'కు కథలు, వ్యాసాలూ మొదలైనవి పంపేవారు గుర్తు పెట్టుకోవలసినవి కొన్ని ఉన్నాయి. ఏమిటంటే—కథలు మరీ పెద్దవి కాకుండా వుండాలి. ఠావుసైజు కాగితం మీద ఆరు, ఏడు పేజీల కథ అయితే బావుంటుంది. మరీ తప్పదనుకుంటే - పది పేజీలకు మించకుండా వుండాలి. వ్యాసాలయితే అదే సైజు కాగితంలో రెండు పేజీలు, తప్పితే మరో అర పేజీ వరకూ వున్నా పర్వాలేదు. పంపిన రచనతో తమ అడ్రసు గల కవరు జతచేస్తేనే, సమాధానం ఇవ్వడానికి సాధ్యం అవుతుంది. ప్రతి రచన మీదా, తమ పేరు, పూర్తి చిరునామా వుండాలి. అది తమ సొంత రచన అన్నట్టుగా విడి కాగితం మీద 'హామీ' కూడా రాసి, సంతకం చెయ్యాలి. ఇహ - పేజీకి ఒక పక్కనే రాయాలనీ, అదీ శుభ్రంగా, విడివిడిగా కలంతోనే రాయాలనీ వేరే రాయనవసరం లేదనుకుంటాము.

—వ. సం.

నిజంగానే నాకావార్త ఎంతో ఆనందం కలిగించింది. రమకి రింగులు వస్తున్నందుకు కాదు. మరో రెండు మూడు చీరలు కొనుక్కోగలుతున్నందుకు కాదు....స్నేహమయి - అరవిందకు నేనేమీ చేయలేకపోతున్నానే అన్న నా బాధ ఇప్పుడు తీరుతున్నందుకు....సమయానికి శ్రీవారు సొమ్ము తేగలిగినందుకు!

ఆ ఆనందంలో అనుకోని పిచ్చిపని కూడా చేసేశాను. ఆయన ఆనందాశ్చర్యాలతో ఉక్కిరిబిక్కిరి అవుతూ, "....అబ్బ, అడక్కముందే ఎన్నాళ్ళకీ వరం ప్రసాదించావు?" అన్నారు.

సిగ్గు పడటం కూడా వాయిదావేసి, "ఇంకో వరం కావాలి. ఇస్తారా?" అన్నాను.

"చెప్పు....నువ్వడిగేవే తక్కువ! కనీసం, అడిగినవయినా ఇవ్వనా?"

"అదేం కాదు. రమ రింగుల కన్న ముఖ్యమయిన పనొకటుంది. దానికి ఖర్చు పెట్టాలని.."

ఆయన ఆశ్చర్యపోయారు. "ఏమిటబ్బా నాకు తెలియని అంత ఖర్చు?"

"అరవింద వాళ్ళింట్లో పరిస్థితి ఏం బాగోలేదు. ఒక్కనెల్లోనే అన్ని ఖర్చులూ ముంచు కొచ్చాయి. ఆమె మరిదికి బ్యాంకులో ఉద్యోగం వచ్చింది కదా! దానికేదో డిపాజిట్టు కట్టాల్సివచ్చిందట. ఈ లోగా అరవింద ఆడపడుచు భర్తతో సహా చుట్టపు చూపు వచ్చింది. వాళ్ళకి బట్టలూ అవీ పెట్టాల్సి వచ్చింది. ఆయని సంగతి మీకు తెల్సిందే కదా! జీతం వచ్చిన రోజునే ఎవరో అత్యవసరంగా కావాలంటే వంద ఇచ్చాడుట. ఆ టైముకు ఆయనకు ఇంట్లో పరిస్థితి కూడా గుర్తు రాలేదు. పాపం, అరవింద జీతమంతా ఇంటి ఖర్చులకే సరిపోయింది. చేతిలో ఇంకేం మిగలక తన మందుల ఖర్చు వాయిదా వేసింది...."

"చిత్రంగా ఉందే....!"

నాకు నవ్వు వచ్చింది. "భలేవారే....అవన్నీ లేను చెప్పిందనుకుంటున్నారా? అలా చెప్పుకొనే మనిషయితే ఎప్పుడో బాగుండిపోయేది. ఆవిడదంతా గుట్టేకదా....!"

"అంటే కబుర్లలో పెట్టి గుట్టు రాబట్టావన్న మాట....!"

"అంతక్కర్లేదు. ఇంట్లో ఏవేం జరుగుతున్నాయో తెల్సుకుంటే చాలదూ! అయినా నేనంతా గ్రహించినట్లు ఆమె కేం తెలియదు లెండి! అందుకనే...."

"ఈ డబ్బు అలా ఇచ్చివస్తానంటావ్! అని నవ్వారాయన.

"రమ రింగులకి కొన్నాళ్ళాగవచ్చు."

"అంతేకాదు. నువ్వు కొనుక్కోవాలనుకున్న చీరలనూ వాయిదా వేయవచ్చు."

"మీరు నా మీద సి. ఐ. డి. పని చేస్తున్నట్టున్నారే!"

"అప్పుడే కదా మంచి మనస్సుల్లో దాగి రగులుతున్న బాధలు తెలిసేది!"

అప్పుడు కనిపించినంత అందంగా ఆయన నాకెప్పుడూ కనిపించలేదు! కళ్ళ నుంచి వెన్నెల కురియటం కన్న మించిన అందం మరెక్కడుంది!

*

"ఏది? డాక్టరుగారిచ్చిన ప్రిస్క్రిప్షన్ ఏది?"

"రావటమే సుడిగాలిలా వచ్చావు. మరేమయినా కమ్మని కబుర్లు చెప్పక—డాక్టర్లు, మందులు వీటి గురించి మొదలెడతావేం?" అంది అరవింద నవ్వుతూ.

"అమ్మాయ్! నువ్వీపూట నేనేం చెప్పినా వినాలి! తెల్సిందా?" అన్నాను చిరుకోపంతో.

"సరే. తిట్టకు." అని అది తెచ్చి నాచేత బెట్టింది.

"ఇది జాగ్రత్తగా పట్టుకువెళ్ళి....మందులు వెంటనే తీసుకురా!" అని వాసుకి పురమాయించి వాడి చేతిలో డబ్బు పెట్టాను.

అరవింద ముఖం ఎఱ్ఱనయింది. నేనది లెక్క చేయలేదు. "ఇంకా అలా నిలబడ్డా వేంరా? వెంటనే వెళ్ళిరా!" అన్నాను వాడితో.

"అమ్మా! వెళ్ళనా?"

నాకు శక్తి సన్నగిల్లిపోతోంది. "నేను చెప్తే ఒకటి, అమ్మ చెపితే ఒకటీనా? వెళ్ళిరారా!" అని మళ్ళీ వాడిని హెచ్చరించాను.

నా మాటకి విలువివ్వాలా—అమ్మ చూపులకి గౌరవమివ్వాలా అన్న సందిగ్ధంలో కొట్టుకులాడుతున్నాడు వాసు.

"వాడి నెందుకలా నిలేస్తావు? వెళ్ళనీ అరవిందా!" అన్నాను.

"అలాగే! ముందీ డబ్బెక్కడిదో చెప్పు."

"ఎక్కడి దేమిటి? నీ డబ్బే! అనసూయగారిచ్చింది. నేను తెచ్చాను...." అన్నాను ఆమె చూపుల్నించి తప్పించుకుంటూ.

ఓ క్షణం మా మధ్య మౌనం. అరవింద ఫక్కున నవ్వింది.

నేనులిక్కిపడ్డాను.

"అబ్బా! వసూకి అబద్ధాలాడ్డం కూడా వచ్చన్న మాట!"

"ఉహూఁ! నిజం...."

"....నిజం నిశ్చలంగా ఉంటుంది. నీ కళ్ళల్లో బెదురు చూస్తుంటే తెలియటంలా! పైగా, అనసూయగారెటువంటిదో నేను గ్రహించలేనను కున్నావా?"

నాకు కోపం వచ్చింది. "అందుకనేనా—మరో ఏభయి తీసుకోండని ధారాదత్తం చేసావ్!"

అరవింద నవ్వింది. "పిచ్చిదానా! అలాంటి వాళ్ళ మీద కోపం తెచ్చుకొని నువ్వు సాధించేదేముంది? వాళ్లు తృప్తంటూ తెలియని బలహీనులు! వాళ్ళు అప్పుసొప్పుచేసి అన్నీ అమర్చుకొని సుఖపడుతున్నారనుకుంటున్నావా? అందిన వాటితో ఆనందం అనుభవించలేక అందని వాటికోసం అర్రులు చాస్తున్నారు. అన్నీ కావాలని అలమటించి పోతున్నారు. ఎన్నున్నా అలాంటి వాళ్ళకింకా కావాలనే ఉంటుంది. వాళ్ళు నిజంగా–లేని వాళ్ళకన్న దురదృష్టవంతులు. వాళ్ళని చూసి మనం జాలి పడాలి! ఎప్పటికయినా వాళ్ళా భ్రమ నుంచి తప్పించుకోవాలని దేవతల్ని ప్రార్థించాలి. చేతనయినంత కృషి మనమూ చేయాలి."

"ఆవిడ మారుతుందని నా కాశలేదు."

"అందుకని మనం మారకూడదు!"

ఇటువంటి ఉన్నత వ్యక్తి గురించి ఎంత హీనంగా మాట్లాడుతోంది అనసూయ! ఆవిడ అన్న ఒక్కమాట కూడ ఈమెకు నేను చెప్పలేదే! ఎంతెలా ఆ మనిషిని అర్థం చేసుకోగలిగింది!

"ఇప్పుడు చెప్పు...నువ్వాడబ్బు ఎక్కడ్నించి తెచ్చావు? ఈ అబద్ధం ఆడటానికి నా కోసం ఎవరినడిగి తెచ్చావు?" అని నన్ను నిలేసింది అరవింద.

"ఎవర్నీ అడగలేదు. నాదే! ఇది నిజం.... ఇక నేనేం చెప్పినా నమ్మవనుకుంటాను!" అన్నాను ఉక్రోషంగా.

చటుక్కున నా చేతులు తనలోకి తీసుకుంది ఆమె. "సరే, నమ్ముతాను. ఇంత డబ్బు ఒక్కసారిగా ఎలా వచ్చిందో అదయినా చెప్పవా?" అని అడిగింది.

"అంటే, అన్నీ చెపితే కాని నానుంచి నువ్వు డబ్బు పుచ్చుకోవన్నమాట! నేను నీకిలా ఇవ్వతగిన దాన్ని కాదన్నమాట!"

"ఛ! ఎందుకంత బాధపడతావ్! నువు ఇబ్బందుల్లో చిక్కుకోకూడదనే కాని....నిన్ను చిన్నబుచ్చాలని కాదు వసూ! నా దగ్గర కొంత దాచిపెడుతున్నావంటే నువు నీ బాధని కప్పిపెట్టుకుంటున్నావని అర్థంకాదా!"

"నీతో నేను వేగలేను తల్లీ! నేవేం దాచిపెట్టటంలేదు. మీ అన్నయ్యకి అరియర్స్ వచ్చాయి. నేనిలా తెచ్చాను. ఆయన అనుమతి తీసుకొనే తెచ్చాను. ఇకనయినా నమ్ముతావా? లేక వాళ్ళాఫీసులో కేషియర్‌ని తీసుకువచ్చి సాక్షిగా నిలబెట్టాలా?"

అరవింద గలగలా నవ్వింది. అంతలోనే నా వైపు సూటిగా చూసింది....."పిల్లకి రింగులు చేయించాలనుకున్నావు ఆ మధ్య! మరి...."

"ఇప్పుడర్జంటుగా రింగులు కావాలమ్మా–అని అదేం అడగటం లేదు. మరి కొన్నాళ్ళు ఆగితే మునిగిపోయిందేమీలేదు కాని, నీ వైద్యానికి–మందులకి మాత్రం వాయిదా వేయటం నేనొక్కక్షణం కూడ భరించలేను...."

"వసూ....!" అరవింద కళ్ళల్లో నీళ్ళు నిలిచాయి. ఆమె పెదవులు వణికాయి. ఏదో మాటాడాలనుకుంటోంది. నాకవేవీ వినాలనిలేదు.

"నీ కభ్యంతరం అచ్చంగా ఈ డబ్బు నీకిచ్చేస్తానేమోననేగా! ఆ భయమేం పడనక్కర్లేదు - ఎప్పటికయినా నువ్వు అనసూయగారిని అడగటం - కనీసం అసలయినా ఆవిడ నీకివ్వటం అంటూ ఉంటుందో లేదో కాని....నేను మాత్రం నిన్ను నిలేసి వడ్డీతో సహా పుచ్చుకుంటాను. సరేనా?"

అరవింద బలహీనమైన చేతులు నా ముఖాన్ని ఆమె గుండెల దరి చేర్చాయి.

ఆమె మాట్లాడలేదు. ఆమె గుండెల్లో ఏదో వెల్లువ పొంగుతున్నట్లు నాకనుభూతి కల్గింది.

నా హృదయంలో నిండిన వాత్సల్యం నానోట ఏదో పలికిస్తూనే ఉంది. "....నీ కోసం నేనేం చేయటం లేదు అరవిందా! నా కోసం నేను చేసుకుంటున్నాను. అనారోగ్యంతో నీకు ఏమయిపోతుందోనని నా భయం. ఆ తర్వాత నేనేమైపోతానో అని నా భయం. నువ్వెప్పుడూ నా కన్నులలో నిలవాలి. అందుకు నాకింకా ఎంతో చేయాలని ఉంది!....నాకున్నదంతా ఇవ్వాలని ఉంది....!" *

గేయం: **అన్వేషణ**

ఏదో చెయ్యాలి! ఎన్నో సాధించాలి!
ఈ విషాద ప్రపంచంలో ఆహ్లాదం కోసం అన్వేషించాలి
బాధ నిండిన బ్రతుకుల్లో అమృతం కురిపించాలి
అపశ్రుతులు పలికే బ్రతుకు వీణపై రాగాలాపన చెయ్యాలి
చెమ్మగిల్లిన కన్నులలో ఆనంద జ్యోతులు వెలిగించాలి
ఇంకా ఎన్నో చెయ్యాలి! ఎన్నో సాధించాలి!
కానీ—
నీ జీవిత ప్రాంగణంలో పెరిగిన ఆశాలతలు
హృదయంలో దాగిన తియ్యని తలపులు
కళ్ళల్లో మెదిలే మధురానుభూతులు
భవిష్యత్తు కోసం నీవు కన్న కలలు
కాంతి వీడి కళా విహీనం అవుతున్నాయి.
అధైర్య పడకు!—
జీవితమంటే సుందర నందన వనం కాదని
పరవశించే మంజుల మురళీ నాదం కాదని
నీకు తెలుసు, అందుకే—
జీవితంలో అలముకున్న చీకటిని కబళించే వెలుగు కోసం
గుండెల్లో రగిలే మంటను చల్లార్చే పన్నీటి జల్లు కోసం
అన్వేషించు!!

వి.యస్. కుమారి.